
గీసుగొండ: బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన ఎస్సై కుమార్


కాశీబుగ్గ: అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు


పర్వతగిరి: అరెస్టయిన బీఆర్ఎస్ యూత్ నాయకులు


కరీమాబాద్: పోలీసుల నిర్బంధంలో బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్ట్

- మహా ధర్నాకు వెళ్లకుండా పోలీసుల అడ్డగింత
- ప్రభుత్వ చర్యలపై పార్టీ శ్రేణుల మండిపాటు
- అక్రమ కేసులకు భయపడం
- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, యూత్ నాయకులు

గీసుగొండ/రాయపర్తి, డిసెంబర్ 6: మాజీ మంత్రి హరీశ్‌రావు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బీఆర్ఎస్ యూత్ విభాగం గీసుగొండ మండల అధ్యక్షుడు శిరిశే శ్రీకాంత్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో నిరసనలు తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని వాపోయారు. ప్రజా హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కోట ప్రమోద్, నమిండ్ల రాజు ఉన్నారు. రాయపర్తి మండలం నుంచి బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల నేతలు ఆకుల సురేందర్‌రావు, మహ్మద్ నయీం, కర్ర రవీందర్‌రెడ్డి, పూస మధు, చందు రామ్‌యాదవ్, అష్రఫ్‌పాషా, ఉబ్బని సింహాద్రి అరెస్టయిన వారిలో ఉన్నారు.

**అంబేద్కర్‌కు నివాళులర్పించే హక్కు లేదా?**

నల్లబెల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదా అని పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి పోలీసులను ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్ట్ చేసిన నేపథ్యంలో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతిలో పాల్గొనేందుకు వచ్చిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అంబేద్కర్ వర్ధంతిలో పాల్గొనేందుకు వచ్చిన తమను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సారంగపాణి అన్నారు. ఇది ప్రజాపాలనా లేదా పోలీస్ పాలనా అని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఎన్.రాజారాం, శ్రీనివాస్‌గుప్తా, గుమ్మడి వేణు, నాయకులు రాజు, సాంబయ్య, అమరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

**అక్రమ అరెస్టులకు భయపడం**

కరీమాబాద్/కాశీబుగ్గ/పర్వతగిరి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మహాధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ వరంగల్ 43వ డివిజన్ నాయకులను మామునూరు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఉద్యమంలో ఎన్నో అరెస్టులు చూశామని, తాము భయపడమని పార్టీ నేతలు అన్నారు. అరెస్టయిన వారిలో నాయకులు జయశంకర్, తాళ్లపల్లి శ్రీనివాస్, యాడాల జగపతి, జోరిక సదన్న, ఉసిల్ల కిరణ్, తేలు రాకేశ్, ఎండీ గౌస్ తదితరులు ఉన్నారు. అలాగే, బీఆర్ఎస్ వరంగల్ 14వ డివిజన్ నేతలను ఎనుమాముల ఎస్సైలు పోగుల శ్రీకాంత్, రాజు శుక్రవారం తెల్లవారుజామున స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ వర్ధన్నపేట డివిజన్ల ఫోరం అధ్యక్షుడు, వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ నేరెళ్ల రాజు, సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్, ఉద్యమకారులు పత్రి రాజపోశాలు, యాదగిరి, మల్లయ్య, గోవిందు, నర్సింగం, కల్యాణ్, సౌరం కవిరాజు ఉన్నారు. బీఆర్ఎస్ పర్వతగిరి మండల యువజన విభాగం అధ్యక్షుడు బూర శ్యామ్‌గౌడ్, రైతు విభాగం అధ్యక్షుడు బాల్లె వెంకట్రాజుగౌడ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల భాస్కర్, చిన్నపెల్లి కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

## బాధిత కుటుంబానికి నరేందర్ పరామర్శ

గిర్మాజీపేట, డిసెంబర్ 6: మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమికి రమేశ్‌బాబు సోదరుడు సురేశ్‌బాబు అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మరణించాడు. విషయం తెలుసుకున్న తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గిర్మాజీపేటలోని వారి స్వగృహానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నన్నపునేని వెంట బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.


కమిటీలోకి ఆహ్వానిస్తున్న రమేశ్‌గౌడ్

## 'తాటిచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నర్సంపేటరూరల్, డిసెంబర్ 6: రాయపర్తి మండలం గట్టికల్ గ్రామంలో తాటిచెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సర్వాపురంలో శుక్రవారం మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. గటికల్‌కు చెందిన మాజీ సర్పంచ్ అనుమతి లేకుండా సుమారు 40 తాటి చెట్లను నరికివేశాడని ఆరోపించారు. అనంతరం మోకు దెబ్బ యువజన సంఘం డివిజన్ కమిటీలో భాంజీపేటకు చెందిన ఆరెల్లి నరేశ్‌గౌడ్, పట్టణ కమిటీలో గౌడిశాల గిరినాథ్‌గౌడ్, గుండెబోయిన శివకోటిగౌడ్‌ను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి గౌడిశాల సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్‌గౌడ్, రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు సాంబయ్యగౌడ్, బొడిగె మల్లేశ్‌గౌడ్, ప్రచార కార్యదర్శి జె నరేశ్, కె శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## గొర్రెల చోరీకి యత్నం

చెన్నారావుపేట, డిసెంబర్ 6: గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల చోరీకి యత్నించిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. బాధితుడు బొంత కుమారస్వామి కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున కోనాపురం రోడ్డులో ఉన్న మందలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు యత్నించగా, గొర్రెలు అరిచాయి. వెంటనే నిద్రలేచి చూడగా మంద వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కనిపించారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా కుమారస్వామిపై దాడి చేసి పారిపోయారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నల్లబెల్లి/గీసుగొండ/చెన్నారావుపేట/కాశీబుగ్గ/సంగెం, డిసెంబర్ 6: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపికయ్యారు. నల్లబెల్లి మండలంలోని నందిగామ జడ్పీహెచ్ఎస్ నుంచి భూమ సాయితేజ అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ తెలిపారు. గీసుగొండ మండలం, గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న అక్షయ్, అన్షు, స్వీటి ఎంపికైనట్లు హెచ్ఎం జ్యోతిర్మయి తెలిపారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న కళ్లెపు హరిప్రియ, బాదావత్ ప్రశాంత్, స్పందన, అక్షిత ఎంపికైనట్లు హెచ్ఎం జయ తెలిపారు. అలాగే, అండర్-17 విభాగంలో వరంగల్ 3వ డివిజన్‌లోని ఆరెపల్లి జడ్పీహెచ్ఎస్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం టి.వెంకన్న, పీడీ పూజారి అశోక్‌బాబు తెలిపారు. అంతేకాకుండా సంగెం మండలం మొండ్రాయి జడ్పీహెచ్ఎస్ నుంచి చెవ్వ తేజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.విజయ, పీడీ ముఖర్జీ తెలిపారు. వీరంతా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆర్మూర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎంలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

## ఓరుగల్లులో అద్భుతమైన శృంగేరి శారద పీఠం

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

పోచమ్మమైదాన్, డిసెంబర్ 6: చారిత్రక వేయిస్తంభాల ఆలయం, భద్రకాళీ ఆలయాలకు తోడుగా అద్భుతమైన శ్రీశృంగేరి శారద పీఠం నిర్మాణాన్ని చేపట్టడం ఓరుగల్లు ప్రజల అదృష్టమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ ఆటోనగర్ శ్రీనివాసకాలనీలో శ్రీశృంగేరి శారద పీఠం పునర్నిర్మాణ శిలాన్యాస పూజ శృంగేరి సాంప్రదాయం ప్రకారం శుక్రవారం జరిగింది. ప్రధానార్చకుడు సంగమేశ్వర జోషి పర్యవేక్షణలో శృంగేరి రుత్వికులు ఆలయ పునర్నిర్మాణానికి వేదమంత్రాల మధ్య విశేష పూజలు నిర్వహించారు. నాయిని హాజరై మాట్లాడుతూ శృంగేరి మాదిరిగా వరంగల్‌లో శారద పీఠం మందిరం రూపుదిద్దుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, డాక్టర్ పోలా నటరాజ్, వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రావు, శంకర సేవా సమితి సభ్యులు రామారావు, దేవేందర్, కుమారస్వామి, రవీందర్, వెంకటేశ్వర్‌రావు, భూపాల్, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాల్గొన్నారు.


శిలాన్యాస పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## రైతులు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

పర్వతగిరి, డిసెంబర్ 6: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆరబోసుకునే క్రమంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ శుక్రవారం సూచించారు. ధాన్యం చోరీకి గురికాకుండా ధాన్యం రాసుల వద్ద కాపలా ఉండాలన్నారు. కల్లాల వద్ద, రోడ్ల వెంట ధాన్యం ఆరబోసుకున్న రైతులు కాపాడుకోవాలని కోరారు.

**గుండెపోటుతో ఓంకారమూర్తి మృతి**


ఓంకారమూర్తి

కాశీబుగ్గ, డిసెంబర్ 6: కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన బట్టల వ్యాపారి, కాశీబుగ్గ వర్తక సంఘం సహాయ కార్యదర్శి, వివేకానంద ఆర్థిక పరపతి సంఘం కోశాధికారి మండల ఓంకారమూర్తి(70) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వ్యాపారులు, రాజకీయ పార్టీల నేతలు ఓంకారమూర్తి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## మత రాజకీయాల ముసుగులో బీజేపీ

**సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య**


మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి భట్టాచార్య

పోచమ్మమైదాన్, డిసెంబర్ 6: మతరాజకీయాల ముసుగులో బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అదానీ జేబులో పెడుతున్నదని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఏజే మిల్ గ్రౌండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోచమ్మమైదాన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థ, స్వేచ్ఛ, సమానత్వాలకు విలువ ఇవ్వడం లేదని విమర్శించారు. దేశంలో విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందే పరిస్థితి లేదన్నారు. జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, కేంద్ర కమిటీ సభ్యుడు ఎన్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా పాల్గొన్నారు.

## సామాజిక సేవకుడికి అవార్డు ప్రదానం


అన్వర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న సారంగపాణి

నల్లబెల్లి, డిసెంబర్ 6: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తికి శ్రీరాముల శ్రీనివాస్ మెమోరియల్ అవార్డును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ప్రదానం చేశారు. ఇటీవల మృతి చెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ జ్ఞాపకార్థం తెలంగాణ ఉద్యమకారుడు భట్టు సాంబయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటకు చెందిన ఎండీ అన్వర్‌కు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అవార్డుతోపాటు రూ. 10 వేల పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో కలం ఫౌండేషన్ కార్యదర్శి పెండ్యాల సలేందర్, పోలోజు రాజమౌళి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌గౌడ్, రాజారాం, కోటిలింగాచారి, శ్రీనివాస్‌గుప్తా, మోహన్‌రెడ్డి, రాజు, నరేశ్, కోర్నేల్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరావు

## చేనేత, హస్త కళాకారుల కోసం సంక్షేమ కార్యక్రమాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 6: హస్త కళాకారుల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని న్యూఢిల్లీ హస్తకళల అభివృద్ధి సంస్థ సహాయ సంచాలకుడు దివ్యారావు అన్నారు. ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా చేనేత జౌళిశాఖ, గోల్కొండ హస్త కళల అభివృద్ధి సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించి, సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా చేనేత, హస్తకళలపై ఇస్తున్న స్పెషల్ డిస్కౌంట్‌ను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. గోల్కొండ షోరూం నుంచి మల్లికార్జున్, చేనేత జౌళిశాఖ ఏడీ రాఘవరావు, ఎస్.చరణ్, రవిరాజ్ పాల్గొన్నారు.

## బోర్డుపై ఫోన్ నంబర్లు మార్చరూ..

కరీమాబాద్, డిసెంబర్ 6: పోలీస్ శాఖ అధికారులకు నూతన నంబర్లు కేటాయించి ఏడాది గడుస్తున్నది. అయినా బోర్డుపై నంబర్లను మార్చకపోవడం శోచనీయం. సాక్షాత్తు మామునూరు ఏసీపీ కార్యాలయ బోర్డుపై పాత ఫోన్ నంబర్లే దర్శనమిస్తున్నాయి. మామునూరు ఏసీపీ కార్యాలయం పరిధిలో ఐదు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఏసీపీని కలిసేందుకు దూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. అధికారి అందుబాటులో లేకపోతే ఫోన్‌లో సంప్రదిస్తారు. కానీ, బోర్డుపై పాత ఫోన్ నంబర్లే ఉండడంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు.



పాత ఫోన్ నంబర్లతో ఉన్న బోర్డు

## ఆత్మరక్షణకు కరాటే దోహదం: మంత్రి

ఖిలావరంగల్, డిసెంబ 6: ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ కొండా సురేఖ అన్నారు. ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో రాణి లక్ష్మీబాయ్ ఆత్మరక్షణ ప్రశిక్షణ్ ద్వారా బాలికలకు ఏర్పాటు చేసిన స్వీయ రక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. బాలికలు తమను తాము రక్షించుకునేందుకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలని మంత్రి సూచించారు. అనంతరం 38వ డివిజన్ పడమరకోటలో వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 1.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్య శారదాదేవి, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, కార్పొరేటర్ బైరబోయిన ఉమ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జీఎంపీఎస్ నేతలు

## గొల్లకురుమల సమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట, డిసెంబర్ 6: గొల్లకురుమల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. గొల్లకురుమల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. రెండో విడుత గొర్రెల పంపిణీ కోసం డీడీలు తీసిన వారందరికీ గొర్రెలు పంపిణీ చేయాలని, మిగతా వారికి నగదు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపెల్లి బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రజా పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Urgently Required Junior lecturers for Biology and Physics and male warden for Shaheen Junior college at Mulugu X Road, Hanumakonda. Contact Ph: 8374999474.

NTW-326564

SKY ASSOCIATES- WANTED

★Area collection executives, Telecallers,Experience is not required Locations: warangal, Narsampet,wardhannapeta, thorrur,parkal , mulugu,Ghanpur,-Cont 9491465729

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



కోచ్‌లతో సమీక్షిస్తున్న డీఎస్‌డీవో సత్యవాణి

## సీఎం కప్ పోటీలు పండుగలా జరపాలి

కాశీబుగ్గ, డిసెంబర్ 5: సీఎం కప్-2024 మండలస్థాయి క్రీడా పోటీలు జిల్లావ్యాప్తంగా పండుగలా జరపాలని డీఎస్‌డీవో సత్యవాణి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె ఓసిటీ ఇండోర్ స్టేడియంలో కోచ్‌లు, సిబ్బందితో సమీక్షించారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న మండలస్థాయి పోటీలకు అబ్జర్వర్లుగా విధులను కేటాయిస్తున్నట్లు ఆమె చెప్పారు. కోచ్‌లు నిర్వర్తించాల్సిన నియమ నిబంధనలను క్లుప్తంగా వివరించారు. సమీక్షలో కోచ్‌లు అనిల్‌కుమార్, సుమన్, లింగమూర్తి, కుమార్, సిబ్బంది మౌనిక, రాజేందర్, అహ్మద్ పాల్గొన్నారు.

## నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

గీసుగొండ, డిసెంబర్ 6: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు సందర్శనకు శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే మేయర్ గుండు సుధారాణితో కలిసి పరిశీలించారు. వారి వెంట గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, టీఎస్ఐసీ అధికారులు ఉన్నారు.

## దంత సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

వర్ధన్నపేట, డిసెంబర్ 6: ప్రతి ఒక్కరూ దంతాలను సంరక్షించుకోవాలని వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి సూచించారు. సీహెచ్‌సీలో శుక్రవారం మహిళలు, గర్భిణుల కోసం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత పరీక్షలు చేశారు. దంతాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు భరత్‌రెడ్డి, అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థులకు గైడ్స్ పంపిణీ**

రాయపర్తి, డిసెంబర్ 6: మండలంలోని కొండాపురం జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన అట్టపల్లి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అట్టపల్లి పురుషోత్తం, అట్టపల్లి రాము, అట్టపల్లి ప్రభు శుక్రవారం గైడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగకుమారి, ఏఎంసీ చైర్మన్ ఎద్దు కొమురమ్మ, ఎద్దు రమేశ్ పాల్గొన్నారు.

## అధికారుల సర్వేను అడ్డుకున్న రైతులు

- ఏళ్ల తరబడి సాగులో ఉన్నాయి
- భూముల జోలికి రావొద్దని హెచ్చరిక

నెక్కొండ, డిసెంబర్ 6: తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూముల్లో సర్వే చేసి తమ భూములను లాక్కునేందుకు యత్నిస్తున్నారని సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. నెక్కొండ ఆర్ఐ నరేందర్, సర్వేయర్ డీఐ కిషన్‌కుమార్, సర్వేయర్లు కుశల్‌కుమార్, శ్రీనివాస్ సర్వేకు వెళ్లారు. విషయం తెలుసుకున్న రైతులు వెంటనే సర్వేను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూముల్లో అధికారులు ఆక్రమించి హద్దురాళ్లు పాతే ప్రయత్నం చేస్తున్నారని, తమ వద్ద పట్టాలు ఉన్నాయని తెలిపారు. తమ భూముల జోలికి రావడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కొన్ని నెలలుగా తోపనపల్లిలోని సర్వే నంబర్ 315లోని భూములపై గ్రామంలో వివాదం ఉండగా, రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన సైతం చేశారు. తమ భూములను ఆక్రమించుకొని క్రషర్ నిర్మించాలనే ఉద్దేశంతో కొందరు యత్నిస్తుండగా, వారికి అధికారులు సహకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

## 'పదేళ్ల సాహితీ సభలను జయప్రదం చేయాలి'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 6: హైదరాబాద్‌లో ఆదివారం తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పదేళ్ల సాహితీ సభలను జయప్రదం చేయాలని తెరసం అధ్యక్ష, కార్యదర్శులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి ఇంటి వద్ద శుక్రవారం సభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, వీఆర్ విద్యార్థి, శనిగరం రాజమోహన్, అన్నాల శ్రీనివాసు, రత్నమాల, అరుణ కీర్తిపతాక పాల్గొన్నారు.

## సఖీ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

పోచమ్మమైదాన్, డిసెంబర్ 6: శిశు సంక్షేమం శాఖ, సఖీ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లే శ్రీలత అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, భద్రతలో భాగంగా ఆటోనగర్‌లోని సఖీ మెయిన్ సెంటర్‌ను గీసుగొండ మండలానికి చెందిన పది గ్రామాల కమ్యూనిటీ మహిళా లీడర్లు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి మహిళా చట్టాలు, హక్కులు, సఖీ సేవలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది శోభారాణి, కౌన్సిలర్ నూర్జహాన్, స్వప్న, తిరుమల, సర్వోదయ సిబ్బంది ఇందిర, రవీందర్, అక్బర్, నాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడ్మినిస్ట్రేటర్ శ్రీలత

## 'సమావేశాన్ని జయప్రదం చేయాలి'

నెక్కొండ, డిసెంబర్ 6: ఈ నెల 11న చేపట్టనున్న ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధ సమావేశాన్ని విజయవంతం చేయాలని దళితరత్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాదిగ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశాడని ఆయన ధ్వజమెత్తారు. మాలల ఒత్తిడికి సీఎం తలొగ్గి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణపై ఇచ్చిన మాటను సీఎం విస్మరించారని విమర్శించారు. వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ తడుగుల విజయ్, ఉద్యమ ప్రతినిధులు మారంపెల్లి కొమ్మాలు, ఇదంపాక ప్రకాశం, శ్యామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

**గ్రంథాలయం ప్రారంభం**

ఖానాపురం, డిసెంబర్ 6: విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. బుధరావుపేట మోడల్ స్కూల్‌లో లీడ్ ఫౌండేషన్, పుస్తకమిత్ర సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం ఎంఈవో ప్రారంభించారు. గ్రంథాలయాన్ని మించిన నిధి మరొకటి లేదని ఆమె అన్నారు. రూ. 50 వేల విలువైన పుస్తకాలను అందించిన లీడ్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీధర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీదేవి

## కల్యాణ మండపం స్థలం పరిశీలన


సునీతను సన్మానిస్తున్న నిర్వాహకులు

కాశీబుగ్గ, డిసెంబర్ 6: కాశీబుగ్గ శ్రీరాములవారి వీధిలోని శ్రీసీతారామాంజనేయ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం స్థలాన్ని శుక్రవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత పరిశీలించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కరీమాబాద్, డిసెంబర్ 6: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1971-72వ విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారంతా ఒకచోట చేరి ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.